నిరాటంకంగా అభివృద్ధి పనులు

● పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్



నీతాఫల్‌మండి డివిజన్‌లో కార్పొరేటర్ హేమ, అధికారులతో కలిసి అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, జనవరి 7: సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పదేళ్ల కాలంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను నిరాటంకంగా కొనసాగిస్తామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ళ పద్మారావుగౌడ్ అన్నారు. నీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో మంగళవారం ఆయన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీతాఫల మండి పరిధిలో కొత్తగా రూ.10 కోట్ల ఖర్చుతో నాలా విస్తరణ పనులకు ఆమోదం లభించిందని తెలిపారు. మహమూద్‌గూడ వద్ద సీవరేజీ సమస్యలు తలెత్తకుండా అధికారులు తగిన ఏర్పాట్లు జరపాలని పద్మారావుగౌడ్ ఈ సందర్భంగా ఆదేశించారు. అనంతరం మహమూద్‌గూడలో రూ.8లక్షల ఖర్చుతో సీవరేజీ లైన్ ఏర్పాటు పనులు ప్రారంభించారు. అనంతనం ఇందిరానగర్‌కాలనీలో రూ.18 లక్షల ఖర్చుతో సీసీరోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ హేమతో కలిసి ప్రారంభించారు. పనుల ప్రారంభోత్సవం సందర్భంగా కార్పొరేటర్ హేమ మాట్లాడుతూ నీతాఫల్‌మండి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని, ఎమ్మెల్యే పద్మారావు సహకారంతో వివిధ ముఖ్యమైన పనులను చేపట్టామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి పనులు వేగంగా జరిగాయని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు విద్యాసాగర్, నవ్య, స్వర్ణలత, కౌశిక్, నాయకులు కరాటే రాజు, బీఆర్ఎస్ సమన్వయ కర్త రాజసుందర్, మహమూద్‌గూడ, ఇందిరానగర్ కాలనీ సంక్షేమ సంఘాల నేతలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, జనవరి 7: టీఎస్ ఎస్‌పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కేవీ రాజేంద్ర ఆయిల్ మిల్, ప్రివెంటివ్ మెడిసిన్, ఫీవర్ ఆసుపత్రి ఫీడర్ల పరిధిలో బధవారం(నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ జి. నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రాజేంద్ర ఆయిల్ మిల్ ఫీడర్ పరిధిలోని హిమాయత్‌నగర్ ఎమ్మార్వో ఆఫీసు, సోప్ ఫ్యాక్టరీ, అచ్చయ్యనగర్, ఆర్టీసీ కళ్యాణ మండపం, రాజేంద్ర ఆయిల్ మిల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రివెంటివ్ మెడిసిన్ ఫీడర్ పరిధిలోని దుర్గా మెస్, శివాజీనగర్, హెచ్‌ఆర్డీ డిగ్రీ కాలేజ్, రత్న డిగ్రీ కాలేజ్, నారాయణగూడ ఫ్లైఓవర్, రెడ్డి కాలేజ్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫీవర్ ఆసుపత్రి ఫీడర్ పరిధిలోని అంజయ్య క్వార్టర్స్, ఫీవర్ ఆసుపత్రి, తెలంగాణ యువతి మండలి, బర్కత్‌పుర పెట్రోల్ బంక్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

నేడు లష్కర్ పరిధిలో సరఫరా ఉండని ప్రాంతాలు

బేగంపేట్, జనవరి 7: విద్యుత్ లైన్లలో తలెత్తిన సాంకేతిక లోపాలు, ట్రిమ్మింగ్ కారణంగా మోండా మార్కెట్ సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్ధేశించిన సమయాల్లో నేడు (బుధవారం) విద్యుత్ అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ విద్యుత్ శాఖ ఏడీఈ అధికారులు తెలిపారు. నీతాఫల్‌మండి సబ్‌స్టేషన్ నామాలగుండు ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నామాలగుండు రామాలయం టెంపుల్, హనుమాన్ టెంపుల్, నెహ్రూనగర్ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపి వేస్తారు. అలాగే వారసిగూడ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు సీతాఫల్‌మండి, మైలార్‌గడ్డ, రోడ్డు నంబర్ 1 ఘరోండ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు.

కుట్టి వెళ్లోడి పనులను పూర్తిచేయాలి

పనులను స్థానిక కార్పొరేటర్ హేమతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

సికింద్రాబాద్, జనవరి 7: సీతాఫల్‌మండిలో నిర్మిస్తున్న కుట్టి వెల్లోడి ప్రభుత్వ వైద్య శాల భవనాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, సూపర్ స్పెషాలిటటీ ఆసుపత్రిగా తీర్చిద్దుతామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ళ పద్మారావుగౌడ్ అన్నారు. నిర్మాణ పనులను అధికారులతో కలిసి ఎమ్మెల్యే మంగళవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో రూ.12 కోట్లతో ప్రత్యేక అనుమతులు సాధించామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ హేమ, వైద్య శాఖ ఇంజినీరింగ్ అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, జనవరి 7: ఆపదలో ఆర్థిక సహాయం అందించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు డివిజన్ల లబ్ధిదారులకు 11 సీఎంఆర్ఎఫ్, రెండు ఎల్వోసీలు మొత్తం రూ.9లక్షల విలువైన చెక్కులను పంపణీ చేశారు. కార్యక్రమంలో కవాడిగూడ, రాంనగర్, ముషీరాబాద్ డివిజన్ల బీఆర్ఎస్ అధ్యక్షులు వల్లాల శ్యామ్‌యాదవ్, శంకర్‌ముదిరాజ్, శ్రీధర్‌రెడ్డి, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, నాయకులు శ్రీధర్‌చారి, పల్లల రవి, కరిక కిరణ్, శివాముదిరాజ్, కల్యాణ్‌నాయక్, బింగి సతీశ్, రామచందర్, రాములు, టిల్లు పాల్గొన్నారు.

రెండో వార్డు వాసికి..

బొల్లారం: సీఎం సహాయ నిధి పేదలకు దోహదపడుతుందని ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. కంటోన్మెంట్ రెండో వార్డుకు చెందిన తరుణికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.18వేల చెక్కును ఎమ్మెల్యే బోయిన్‌పల్లిలోని తన కార్యాలయంలో అందజేశారు.

ప్రయాణికుల భద్రత, రక్షణకు కృషి

లాలాపేట రైల్వే బ్రిడ్జి వద్ద అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్పీఎఫ్ ఎస్ఐ ఎం.వెంకట్‌రెడ్డి

మారేడ్‌పల్లి, జనవరి 7: రైల్వే ప్రయాణికుల భద్రత, రక్షణ కోసం ఆర్పీఎఫ్ పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నట్లు సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకట్ రెడ్డి అన్నారు. లాలాపేట–తార్నాక రైల్వే బ్రిడ్జి వద్ద మంగళవారం ఆపరేషన్ సంరక్షణలో భాగంగా రాళ్ల దాడి, హ్యూమన్ రన్ ఓవర్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలను నివారించడానికి, ప్రయాణికులు సురక్షితమైన రైల్వే ప్రయాణాన్ని చేయడానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కదులుతున్న రైళ్లను ఎక్కడం, దిగడం వల్లన కలిగే నష్టాలను వివరించారు. భద్రతా అవగాహనను మరింత పెంచేందుకు, రైల్వే భద్రతకు సంబంధించి, ఆందోళనలు ఎదురైనప్పుడు తక్షణ సహాయం కోసం రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ టోల్–ఫ్రీ నంబర్ 139 కు కాల్ చేయాలని సూచించారు. రైల్వే వినియోగదారుల్లో భద్రత, అప్రమత్తత సంస్కృతిని ప్రోత్సహించడానికి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ నిబద్ధతతో పని చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్ర సంఘం నేతకు నివాళి

సికింద్రాబాద్, జనవరి 7: తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో సందిరి బాలయ్య 58 వర్ధంతి నిర్వహించారు. మంగళవారం నామాలగుండు గంగపుత్ర వెల్ఫేర్ సొసైటీ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బాలయ్య నిర్మించిన తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం ద్వారా ఎన్నో మంచి కార్యక్రమాలు చేసిన ఏఎల్ మల్లయ్యను ఈసందర్భంగా గుర్తు చేసుకున్నారు. తన చివరి శ్వాస వరకు సంఘాన్ని బలోపేతం చేశారని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో సంఘాన్ని బలోపేతం చేద్దామని కోరారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు మోసం రాజ లింగం, కార్యదర్శి యెర్ర బోయిన మల్లేశ్, కోశాధికారి మూట గణేశ్, మంగిలిపల్లి రాజమౌళి, కట్కూరి అశోక్, వేంపటి భాస్కర్, మహిళా గంగాపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాచమల్ల స్వర్ణలత, నాగులభారతి, కంటే బుచ్చమ్మ, కోయేటి రేణుక, గుండు సక్కుబాయి, పద్మ వసంత, నాగుల పద్మ తదితరులు పాల్గొన్నారు.

నామాలగుండులో సందిరి బాలయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గంగపుత్ర సంఘం నాయకులు, మహిళా కార్యవర్గ నాయకురాళ్లు

ఏఐఓబీసీఎస్ఏ ఓయూ అధ్యక్షుడిగా మహేశ్‌గౌడ్



ఏఐఓబీసీఎస్ఏ నూతన ఓయూ కమిటీ సభ్యులు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 7: ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఓబీసీఎస్ఏ) ఓయూ అధ్యక్షుడిగా బొడిగె మహేశ్ నియమితులయ్యారు. ఏఐఓబీసీఎస్ఏ ఓయూ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా ప్రశాంత్, సింధు, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్‌యాదవ్, రాకేశ్‌యాదవ్, సంయుక్త కార్యదర్శిగా కళ్యాణ్, ఆర్ట్స్ కళాశాల కోఆర్డినేటర్‌గా రాముగౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా వినయ్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా బొడిగె మహేశ్ మాట్లాడుతూ ఓబీసీ విద్యార్థుల అభ్యున్నతి కోసం పాటుపడతామని అన్నారు. విద్య, సాధికారత అంశాల్లో విద్యార్థులకు అండగా నిలుస్తామని చెప్పారు. బహుజన యోధుల మద్దతుతో మరింత సమగ్రమైన, సమానమైన సమాజాన్ని నిర్మించేందుకు తాము కట్టబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

క్రీడలు మానసిక, మేధో వికాసానికి సోపానాలు

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న ఓయూ రిజిస్ట్రార్ నరేశ్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 7: క్రీడలు మానసిక, మేధో వికాసానికి సోపానాలని ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి అన్నారు. జార్జిరెడ్డి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జార్జిరెడ్డి జయంతి స్మృతిలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జార్జిరెడ్డి లాంటి విద్యార్థి మేధావుల జీవితాలను నేటి తరం యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం హెడ్ ప్రొఫెసర్ రాజేశ్, విద్యార్థి నాయకులు ఎస్.నాగేశ్వర్‌రావు, సుమంత్, వెంకటేశ్, అంజి, కోటేశ్వర్, ధనుష్, క్రాంతి, రంజిత్, నూతన్, బాలకృష్ణ, సాగర్, ప్రతాప్, భాను, మారుతి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

అల్పాహారం అందజేస్తున్న కందూరి కృష్ణ

చిక్కడపల్లి, జనవరి 7: కందూరి కృష్ణ ఫౌండేషన్, సెట్ మాణిక్‌లాల్ ఫౌండేషన్, ట్విన్ సిటీస్ క్లబ్ సంయుక్తంగా మంగళవారం చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లిలో పేదలకు అల్పాహార పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు కందూరి కృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని అన్నారు. తాము ప్రతిరోజు నిరుపేదలకు, అభాగ్యులకు సుమారు 1700 మందికి ఉచితంగా అల్పాహారం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కె.ప్రమోద అగర్వాల్, అడ్వికేట్ కౌశిక్, హెచ్ గోవింద్‌రావు, డాక్టర్ సంగీత, రిటైడ్ ఏసీపీ ఎ.నారాయణగౌడ్, దినేశ్, మౌనిక అరుణ పాల్గొన్నారు.

రచయితలు, మేధావులపై పెరుగుతున్న దాడులు

ముషీరాబాద్, జనవరి 7: తెలంగాణ రాష్ట్రంలో కొన్ని రోజులుగా ప్రగతిశీల రచయితలు, మేధావులు, ఉపాధ్యాయులపై మతోన్మాద గుండాల దాడులు పెరిగిపోతున్నాయని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి పి.సూర్యం అన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో కొంత మంది ఉన్మాదులు వీక్షణం సంపాదకులు వేణుగోపాల్‌పై దాడి చేయడం అత్యంత దుర్మార్గమని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దాడిని ప్రజాస్వామికవాదులు ఖండించాలని, బెదిరింపు కాల్స్, సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేయడం శోచనీయమని అన్నారు. చంపుతామని బెదిరింపులకు పాల్పడటం ఫాసిస్టు పోకడలకు నిదర్శనమని విమర్శించారు. ఇటువంటి చర్యలను ప్రభుత్వం ఉక్కుపాదంతో అణిచివేయాలని కోరారు.

'పారదర్శకంగా పార్ట్‌టైం అధ్యాపకుల నియామకాలు'

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 7: ఓయూ జర్నలిజం విభాగంలో పార్ట్ టైం అధ్యాపకుల నియామకాలను పారదర్శకంగా నిర్వహించినట్లు అధికారులు స్పష్టం చేశారు. కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తను ఖండించారు. ఊహాజనితమైన విషయాలను ప్రచురించే ముందు వర్సిటీ వివరణ తీసుకోవాలని సూచించారు. అన్ని అర్హతలతో పాటు నిబంధనలకు అనుగుణంగానే నియామకం జరిగిందని ఉద్ఘాటించారు.

9న ఫాస్ అక్కినేని సెంటినరీ ఫిలిం అవార్డుల ప్రదానం

చిక్కడపల్లి, జనవరి 7: ఫిలిం ఎనలిటికల్ అప్రిసియేషన్ సొసైటీ(ఫాస్) 27వ వార్షికోత్సవం సందర్భంగా 9న తెలుగు ఫిలిం చాంబర్ థియేటర్ ఫిలింనగర్‌లో అక్కినేని సెంటినరీ ఫిలిం అవార్డుల ప్రదానం ఉంటుందని సంస్థ అధ్యక్షుడు, చైర్మన్లు ధర్మారావు, సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు తెలిపారు. కార్యక్రమ బ్రోచర్‌ను చిక్కడపల్లిలో ఆవిష్కరించారు. సినీ జీవన సాఫల్య పురస్కారం ప్రఖ్యాత సినీ నటుడు కోట శ్రీనివాస్‌రావు, నాలుగు దశాబ్దాల సినీ జీవిత అవార్డులను ప్రముఖ నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ, ప్రముఖ సినీనటి కవితకు అందజేస్తారని చెప్పారు. ముఖ్యఅతిథులుగా ప్రముఖ సినీ నటుడు బాబుమోహన్, ప్రముఖ నిర్మాత, సి.కల్యాణ్, తెలుగు సినీ నిర్మాత మండలి కార్యదర్శి కె.దామోదర్ ప్రసాద్, కార్యదర్శి టి.ప్రసన్నకుమార్ హాజరు కానున్నట్లు తెలిపారు.

బడి ఈడు పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు

సమావేశంలో అధికారులు, వక్తలు, పాల్గొన్న పలు సంఘాల నాయకులు

సికింద్రాబాద్, జనవరి 7: బడి ఈడు పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మారేడుపల్లి తహసీల్దార్ భూమయ్యగౌడ్ హెచ్చరించారు. మారేడుపల్లి మండల పరిధిలోని బాబు జగ్జీవన్‌రాం కమ్యూనిటీ భవనంలో బాలల హక్కులు–పాఠశాలల స్థితిగతులపై వివిధ ప్రభుత్వ శాఖల మండల అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ బడి బయటి పిల్లలందరినీ బడిలో చేర్పిద్దామని, ఎవరైనా చిన్నారులను పనిలో పెట్టుకుంటే తమకు సమాచారం ఇవ్వాలని అన్నారు. సీడీపీఓ స్వప్న మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో వసతులను మెరుగు పరిచి సేవలను అందిస్తామన్నారు. ఎంవీ ఫౌండేషన్ స్టేట్ కోఆర్డినేటర్ వై.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రతిమూడు నెలలకు ఒకసారి తహసీల్దార్ ఆధ్వర్యంలో అన్ని విభాగాలతో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం మీటింగ్ జరగాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై దయాకర్, డీసీపీఓ శ్రీనివాస్, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ భరద్వాజ్, తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జి.భాగ్యలక్ష్మి, హెల్త్ డిపార్ట్మెంట్ సుబ్బారావు, ఎంవీ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఏవీఎం స్వామి, సీఆర్‌పీఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మినారాయణ, మండల కన్వీనర్ ప్రవీణ్, రమాదేవి, అజయ్ బాబు, శోభ, జమున, అంగన్వాడీ సూపర్‌వైజర్ సంధ్య, కాంపల్లి శ్రీనివాస్, వీరయ్య, గోపి, శాంతి, లక్ష్మి, శ్యామల, శశికళ, ఎంవీ ఫౌండేషన్ ఆర్గనైజర్లు ఎ.సువర్ణ, బి.భాగ్య, సుమలత, లావణ్య, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా వ్యాధిని నిర్మూలించాలి: కార్పొరేటర్

వైద్యులు, ఆశ వర్కర్లతో సమావేశమైన కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, జనవరి 7: కుట్టి వెల్లోడి ఆసుపత్రిలో జరిగిన ఫైలేరియాసిస్ నిర్మూలన, రక్త నమూనా సేకరణ సమావేశంలో కార్పొరేటర్ హేమ పాల్గొన్నారు. ఆర్యసమాజ్, మేడిబావిలో మంగళవారం రాత్రి 8గంటలకు ప్రారంభమయ్యాయి. ఈనెల 9, 10 తేదీల్లో రాత్రి 8 నుంచి అర్ధరాత్రి 12గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారని చెప్పారు. ఫైలేరియా అని పిలిచే దారం లాంటి పురుగు వల్ల కలిగే పరాన్నజీవి వ్యాధి ఇది. ఈ వ్యాధి వల్ల కాళ్లు, చేతులు లేదా జననేంద్రియాలు ఉబ్బుతాయని అన్నారు. ఈ పరిస్థితిని సాధారణంగా ఎలిఫెంటియాసిస్ అని పిలుస్తారన్నారు. వ్యాధి వ్యాప్తి చెందే దోమలు కుట్టకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ప్రత్యూష, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతి

బన్సీలాల్‌పేట్, జనవరి 7: ఇటీవల గాంధీనగర్ పీఎస్ పరిధిలో నరేందర్ అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. దానిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి విచారించాలని హైదరాబాద్ జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మా నిటరింగ్ సభ్యురాలు పలి కల్పన బాధితులు విజయలక్ష్మి, శారదతో కలిసి ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. గత సెప్టెంబర్‌లో భోలక్‌పూర్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఎరుకల నరేందర్ బోయిగూడ కల్లు దుకా ణం వద్ద అగంతకులు దాడి చేయడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడని వారు ఈ సందర్భంగా వివరించారు.

గాయని రేణుకకు వంశీ గ్లోబల్ మ్యూజిక్ అవార్డు

ముషీరాబాద్, జనవరి 7: వంశీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో మంగళవారం సినీ సంగీత విభావరి, మధుర గాయని రేణుకకు వంశీ గ్లోబల్ మ్యూజిక్ అవార్డు ప్రదానోత్సవం జరిగింది. కార్యక్రమంలో వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని అవార్డు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వంశీ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు తెన్నేటి సుధాదేవి, మేనేజింగ్ ట్రస్టీ సుంకరపల్లి శైలజ, సుధామయి, రామకృష్ణ, శంకర్, లలిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్పోర్ట్స్ డే

బొల్లారం, జనవరి 7: యంగ్ ఇండియన్స్ హైదరాబాద్, మానసిక వికలాంగుల కేంద్రం (ఎన్ఈపీఐడీ)సహకారంతో మంగళవారం బోయిన్‌పల్లిలో స్పోర్ట్స్ డే నిర్వహించారు. యంగ్ ఇండియన్స్ ప్రతినిధులు మాట్లాడుతూ మేధోపరమైన వైకల్యాలు ఉన్న విద్యార్థులకు సాధికారత కల్పించడంతో పాటు, మానసికంగా అభివృద్ధి చెందేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలోని 22 మానసిక వికలాంగుల పాఠశాలల నుంచి సుమారు 1400 మంది విద్యార్థులు పాల్గొన్నారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు గోల్డ్, సిల్వర్ మెడల్స్ పతకాలు, ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఐఈసీఐడీ, వివిధ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అజంతా రైల్లో చోరీ

కాచిగూడ, జనవరి 7: అజంతా రైల్లో ప్రయాణికుని బంగారు ఉంగరం, నగదు దొంగిలించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప ప్రకారం.. నిజాంపేటకు చెందిన ఆచార్యులు. కాచిగూడకు వస్తుండగా బాసర రైల్వే స్టేషన్ సమీపంలో బ్యాగు చోరీ చేశారు. అందులో ఉంగరం, రూ.9,500 వేల ఖరీదైన ఫోన్ ఉన్నట్లు తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు రైల్వే సీఐ తెలిపారు.

PUBLIC NOTICE

General public hereby informed that my client L.Ravi Prakash S/o. Late Laxman Lal, aged about 52 years, R/o. H.No. 1-8-26, Temple Alwal, Secunderabad, Ph. No. 9908232323 is the sole and absolute owner of residential house bearing no. 3-6-188, admeasuring 250 Sq.Yards, having Plinth area of 1000 Sq.Feet, situated at Boosareddyguda, Secunderabad Contonment. My client lost the original documents of above said property i.e.1). Original Sale deed vide document No. 1814/2013 registered at S.R.O, Bowenpally, 2). Original Link document no. 1015/1998 registered at S.R.O, Hyderabad and 3). Original Link document No. 1017 of 1988 registered at S.R.O, Hyderabad while travelling from his home to ECIL in the month of December, 2024.

It is therefore request the public in general if anyone found the above said documents kindly intimate the same to me or my client.

Sd/- **G. JITHENDER REDDY**
Advocate
H.No. 1-4-190/ 47/A, Bhaskar Rao Nagar Colony, Sainikpuri, Secunderabad-500094
Ph: 9440763099.